క్లుప్తంగా

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

మణుగూరు రూరల్: 2023–24 విద్యా సంవత్సరానికి గానూ తెలంగాణ గిరిజన సంక్షేమ మినీ గురుకులం బాలికల విద్యాలయం-పినపాక (ఐలాపురం)లో ఒకటి, రెండు తరగతుల ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని గురుకుల లైజన్ ప్రిన్సిపల్ ఏ.పద్మావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల విద్యాలయంలో ఒకటో తరగతికి 30 సీట్లు, రెండో తరగతికి మిగిలిపోయిన బ్యాక్‌లాగ్ సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు ఈ నెల 7 నుండి మే 5 లోపు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్, పుట్టినతేది, అభ్యర్థి సంతకం, మొబైల్ నంబర్‌తో కూడిన దరఖాస్తులను హెచ్‌ఎంకు అందజేయాలని పేర్కొన్నారు. అభ్యర్థులను లాటరీ పద్ధతిన ఎంపిక చేయడం జరుగుతుందని, పాఠశాలలో విద్యార్థినులకు ఒకటో తరగతి నుండి ఐదో తరగతి వరకు సీబీఎస్‌ఈ లబస్ ఆంగ్లమాధ్యమంలో బోధన అందజేస్తూ, అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9177307489,7702652708 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



మాట్లాడుతున్న నాయకులు

బూర్గంపాడు: నూతనంగా నిర్మించిన రాష్ట్ర సచివాలయానికి బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టడంతో పాటుగా 125 అడుగుల విగ్రహాన్ని పెడుతున్నందుకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి బీఆర్‌ఎస్ దళిత విభాగం ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. శుక్రవారం బూర్గంపాడు ప్రధానకూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు వలదాసు సాలయ్య మాట్లాడుతూ.. దళితుల అభ్యున్నతికి దళిత బంధు వంటి మహత్తర పథకాన్ని తీసుకువచ్చిన కేసీఆర్‌కు దళితులు అండగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జక్కం సుబ్రహ్మణ్యం, నాయకులు భూపెల్లి నర్సింహారావు, శ్రీనివాస్, మందా ప్రసాద్, ఖాదర్, ఈసంపల్లి వెంకటేశ్వర్లు, చెక్కా నర్సింహారావు, కోట జయరాజ్, కోట శ్రీరామ్మూర్తి, సురేష్, ఈశ్వర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మహాధర్నాకు తరలిరండి

అశ్వారావుపేటరూరల్: బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నేడు కొత్తగూడెంలో తలపెట్టిన మహా ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా, సింగరేణిని ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ నిర్వహించే ఈ ధర్నా కార్యక్రమానికి మండలంలోని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

11 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

దమ్మపేట: మండల పరిధిలోని నాచారం గ్రామంలో గుట్ట పై వేంచేసియున్న శ్రీ జగదాంబ సమేత జై లింగేశ్వర స్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 11 నుంచి 13 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా గణపతి పూజ, గోపూజ, చండీయాగం, రుద్రాభిషేకం, కలశాభిషేకం, అమ్మ వారికి కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలను వేదపండితుల సమీక్షంలో జరుగుతాయని తెలిపారు. బ్రహ్మోత్సవాల చివరి రోజు భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

వలస కూలీలకు మలేరియా పరీక్షలు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని ఊట్లపల్లి సమీపంలోగల అటవీ ప్రాంతంలో వెదురు నరికేందుకు వచ్చిన వలస కూలీలకు వినాయకపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం మలేరియ నిర్ధారణ పరీక్షలు చేశారు. అటవీ శాఖకు చెందిన వెదురు నరికేందుకు కొద్ది రోజుల క్రితం మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చిన 22 మంది కూలీలను గుర్తించి వారందరికీ పరీక్షలు చేసి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది గోపాల్, శ్రీనివాసరావు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

రేపు ఎంసెట్ మోడల్ పరీక్ష

బూర్గంపాడు: ఈ నెల 9న సారపాకలోని బ్రిలియంట్ స్కూల్‌లో ఎంసెట్ మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ బి.నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రెండుర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఉచితంగా ఎంసెట్ కోచింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. హాజరయ్యే విద్యార్థులు 9866283566, 9705137128 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

క్రీస్తు మార్గంలో పయనించాలి

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే
- కళ్లకు కట్టినట్టు సిలువమార్గం ప్రదర్శన
- చర్చిల్లో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు

దుమ్ముగూడెం: మండలంలోని పలు చర్చిల్లో గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో శుక్రవారం జరుపుకున్నారు. లక్ష్మీనగరం గ్రామంలోని చర్చిలో భద్రాచలం శాసనసభ్యులు పొదెం వీరయ్య ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీసస్ మహాత్యాగానికి గుర్తు గుడ్ ఫ్రైడే అని, ప్రతీ ఒక్కరు క్రీస్తు చూపిన మార్గంలో పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లంకా శ్రీనివాసరావు, పిలకా వెంకటరమణరెడ్డి, కనుబుద్ది దేవా, లంకా శివకుమార్, దర్శి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: మండలంలోని నాగినేనిప్రోలు, సారపాక చర్చిల ఆధ్వర్యంలో శుక్రవారం సిలువమార్గం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విచారణ గురువులు ఫాదర్ జోషఫ్ విజయ్‌కుమార్ మాట్లాడగా ఫాదర్ సతీష్ , ఫాదర్ లూర్దు పలువురు క్రైస్తవ మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: పట్టణంలోని బస్టాండ్ వెనుక బ్యాంక్ సెంటర్‌లోని సీఎస్‌ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యేసు మానవాళికి అందించిన దివ్య సందేశాన్ని చర్చిఫాదర్ పి. రమేష్ వినిపించారు. క్రీస్తువేషాధారణలో నాటికను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు.

మణుగూరుటౌన్: మండలంలోని చర్చీల్లో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అశోక్‌నగర్ సెంట్ జాన్ చర్చిలో పాస్టర్ జర్మియా, క్రీస్తు సిలువ వేయబడిన తీరును గురించి పాపుల కోసం ఆయన చేసిన ప్రాణత్యాగం గురించి క్షుణ్ణంగా వివరించారు.

కార్మిక వాడల్లో..

మండలంలోని పీవీకాలనీలోని హోలీ ఫ్యామిలీ చర్చి నుంచి అక్కడ ఉన్న గుట్టపైకి ఆర్‌సీఎం చర్చికి చెందిన క్రైస్తవులు సిలువ మార్గం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాస్టర్ జేసురాజు, కమిటీ సభ్యులు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే సందర్భంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులు అధిక సంఖ్యలో హాజరు కాగా, చర్చిలు కిటకిటలాడాయి.



బూర్గంపాడు: నాగినేనిప్రోలులో సిలువమార్గంలో పాల్గొన్న క్రైస్తవులు



మణుగూరు రూరల్: సిలువ యాత్ర..



అశ్వాపురంలో..

మణుగూరు రూరల్: మండలంలోని పీవీకాలనీలో ఆర్సీఎం చర్చి ఫాదర్ జేసురాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కాలనీ వీధుల్లో ఏసుక్రీస్తు సిలువ యాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ లీనా, జెస్సీ, సిస్టర్ వెనీలా, రమేష్‌బాబు, అఖిల్, మాధురీ, కూటాస్, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని గ్రామాల్లో క్రైస్తవులు ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిలలో పాస్టర్లు ఏసుక్రీస్తు బోధనలను బోధించారు.



దుమ్ముగూడెం: చర్చిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య



ములకలపల్లిలో సిలువ యాత్ర..

చండ్రుగొండ : మండలకేంద్రంలో ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో గ్రామం నుంచి జాతీయ రహదారి మీదుగా సిలువమార్గము ప్రదర్శన నిర్వహించారు. చర్చి ఫాదర్ రమేష్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు.

ములకలపల్లి : మండలవ్యాప్తంగా పురవీధుల్లో సిలువ మోస్తూ పాదయాత్ర చేశారు, క్రీస్తు వాక్యాలను వివరిస్తూ, ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

చర్ల: మండలంలోని పలు చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సిలువ మార్గంలో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మణుగూరుటౌన్: సెయింట్ జాన్ చర్చిలో ప్రార్థనలు



భద్రాచలంటౌన్: ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



అన్నపురెడ్డిపల్లి: ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



అశ్వారావుపేటరూరల్‌లో..

బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న నాయకులు

దుమ్ముగూడెం: అగ్నిప్రమాద బాధితులకు ప్రభుత్వం తరుపున అండగా ఉంటామని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం నడికుడి గ్రామపంచాయతీ పరిధిలోని ధర్మారం కొత్తగూడెం గ్రామంలో అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను పరామర్శించి పార్టీ ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు, వంట సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కణితి రాముడు, నాయకులు జానిపాషా, తునికి కామేష్, దామెర్ల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు తెల్లం రామకృష్ణ, మడకం నాగేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

నాలుగో రోజుకు చేరిన దీక్ష



దీక్షలో పాల్గొన్న గిరిజనులు

అశ్వారావుపేటరూరల్: ఇళ్ల స్థలాలు కేటాయించాలని నిరుపేద గిరిజనులు చేపట్టిన నిరసన దీక్ష నాల్గో రోజుకు చేరింది. మండల పరిధిలోని వినాయకపురం గ్రామ పంచాయతీ ఎర్రగుంటపల్లి వద్ద గల ప్రభుత్వ స్థలాన్ని నిరుపేదలైన గిరిజనులకు కేటాయించాలని పలు గ్రామాలకు చెందిన గిరిజనులు చేస్తున్న దీక్ష శుక్రవారం కొనసాగింది. గిరిజనలు చేపట్టిన దీక్ష రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సరియం వెంకట మహేశ్వరరావు, తెల్లం రాముడు, కొడిమి జోగరావు, ఎస్ వెంకన్నబాబు, రాధిక, కట్టం బుచ్చమ్మ, వూకే భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైఫల్యాలను పక్కదారి పట్టించేందుకే కేసులు



మాట్లాడుతున్న కుంజా సత్యవతి

భద్రాచలంటౌన్: తప్పుడు కేసు పెట్టి అక్రమ అరెస్టులు చేస్తే కోర్టులో చివరికి న్యాయమే గెలిచిందని భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి అన్నారు. పట్టణంలోని సినిమా హాల్ సెంటర్‌లో శుక్రవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కి బెయిల్ మంజూరై బయటకు వచ్చిన సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ ఆయన చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు, గ్రూప్–1 పేపర్ లీకేజీలో ప్రభుత్వ వైఫల్యాలను పక్కదారి పట్టించేందుకే బండి సంజయ్ మీద అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ములిశెట్టి రామ్మోహన్ రావు, వెంకటరెడ్డి, సత్యనారాయణ, సతీష్, నాగబాబు, వెంకన్న, చక్రవర్తి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

ములకలపల్లి : నిరుద్యోగ సమస్య పరిష్కరించి, వెంటనే ఉద్యోగ భర్తీ నోటిఫికేషన్ విడుదల చేయాలని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు సోయం వీరభద్రం డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో ములకలపల్లిలో శుక్రవారం కాగడాలతో నిరసన ప్రదర్శన చేశారు. 'టీ–సేవ్' పేరిట మండలకేంద్రంలోని తెలంగాణతల్లి సెంటర్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ నియోజకవర్గ బాధ్యుడు సోయం కృష్ణ, మండలాధ్యక్షుడు కందుకూరి రాంబాబు, తాటి రమణ, జిల్లా రపు వెంకటేశ్వర్లు తదితరుల పాల్గొన్నారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా..

అశ్వారావుపేటరూరల్: ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన శుక్రవారం మండల పరిధిలోని వినాయకపురం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి విద్యుత్ స్తంభాల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ గ్రామ సమీపంలోగల రాళ్ల వాగు మలుపు వద్ద ఒక్కసారిగా అదుపు తప్పడంతో బోల్తా పడింది. దీంతో అప్రమత్తమైన ట్రాక్టర్ డ్రైవర్ కిందకు దూకడంతో సురక్షితంగా బయటపడ్డాడు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం



కార్మికులకు యోగా ప్రాముఖ్యత వివరిస్తున్న జీఎం లలిత్‌కుమార్

మణుగూరుటౌన్: యోగా, ధ్యానంతో మానసిక ఒత్తిడిని జయించవచ్చని ఏరియా ఎస్వోటూ జీఎం డి.లలిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మణుగూరు ఏరియాలోని ఎంవీటీసీ కార్యాలయంలో మూడు రోజులుగా నిర్వహించిన యోగా శిక్షణ తరగతులు ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రతీరోజు యోగా ధ్యానం చేయడంతో షుగర్, బీపీల వంటి మానిసక వత్తిడిని నివారించుకోవచ్చన్నారు. యోగా వల్ల ప్రశాంతవంతమైన, ఆరోగ్యకరమైన జీవితాన్ని ఆస్వాదించవచ్చన్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్స్టిట్యూట్, శ్రీరామచంద్ర మిషన్ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ యోగా మహోత్సవం పేరుతో కార్మికులకు, ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడం అభినందనీయం అన్నారు. అనంతరం జోనల్ కోఆర్డినేటర్ టీవి రమణ మాట్లాడుతూ.. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, యోగాని దినచర్యలో భాగంగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీటీసీ మేనేజర్ నాగేశ్వరరావు, ఏటీఓ లక్ష్మణ్, నోడల్ కోఆర్డినేటర్ టి.బాలకృష్ణ, అధికారులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

దమ్మపేట: మండల పరిధిలోని మొద్దులగూడెం గ్రామంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, వృద్ధులు తీసుకోవాల్సిన పోషకాహారం, ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జి.సుజాత, ఏఎన్‌ఎం కె.సుజాత, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌నగర్‌లో ఫ్రైడే డ్రైడే..

మణుగూరు రూరల్: మండలంలోని అశోక్‌నగర్ ఏరియాలో శుక్రవారం మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని, నిర్వహించారు. మండలంలోని ఆరోగ్య ఉపకేంద్రాల్లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటి సర్వే నిర్వహించి షుగర్, రక్తపోటు తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మందులను పంపిణీ చేశారు. గర్భిణులకు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు వేశారు. సోమవారం నుంచి మణుగూరు ఆర్టీసీ డిపోలో కంటి వెలుగు ప్రారంభం కానుందని, ఆర్టీసీ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యసిబ్బంది కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి లింగ్యా నాయక్, రాంప్రసాద్, ఆర్టీసీ డిపో మేనేజర్ స్వామి, ప్రమీల, విజయ, లక్ష్మీ, దుర్గ, సుజాత తదితరులు పాల్గొన్నారు.



దమ్మపేట: అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



మణుగూరు రూరల్: సర్వే చేస్తున్న సిబ్బంది

ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధిపై శ్రద్ధ

మణుగూరు రూరల్: మండలంలోని ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాల, డిగ్రీ, జూనియర్ కళాశాలలో రూ.52 లక్షల సింగరేణి సీఎస్ఆర్ నిధులతో నూతనంగా నిర్మించనున్న అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్‌లు శుక్రవారం శంకుస్థాపన, భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా విప్ రేగా కాంతారావు మాట్లాడుతూ... ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. అనంతరం జీఎం రామచందర్ మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం సామాజిక బాధ్యతలో భాగంగా సంస్థ ప్రభావిత, పరిసర గ్రామాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు వెచ్చిస్తోందన్నారు. మణుగూరులో విద్యాసంస్థల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు, సీఅండ్‌ఎండీ శ్రీధర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం విజయకుమారి, జెడ్పీటీసీ పోశం నరసింహారావు, ఏరియా ఎస్వోటు జీఎం డి.లలిత్‌కుమార్, ఏజీఎం సివిల్ వెంకటేశ్వర్లు, ఇంజనీర్ నర్సిరెడ్డి, టిబిజికెఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్‌రావు, ఎంపీటీసీలు రమ్య, వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, సర్పంచ్ బచ్చల భారతి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బోర్‌వెల్ ప్రారంభం

కరకగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో నీటి కొరత లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మండలంలోని గొల్లగూడెం గ్రామ పంచాయతీ పరధిలో సుమారు రూ.1.5 లక్షల వ్యయంతో బోర్‌వెల్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇర్ప విజయ్ కుమార్, ఎంపీటీసీ కొమరం మునేంద్ర, ఉప సర్పంచ్ చేను సాంబయ్య, యూత్ ప్రెసిడెంట్ గుడ్ల రంజిత్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.



మణుగూరు రూరల్: శంకుస్థాపన చేస్తున్న విప్ రేగా కాంతారావు



కరకగూడెం: బోర్‌వెల్‌ను ప్రారంభిస్తున్న రేగా

అటెన్షన్ ప్లీజ్

ఇలా వదిలిస్తే ఎలా..?



మిషన్ భగీరథ పథకానికి సంబంధించిన పైపులైన్‌లో ఏర్పాటు చేసిన మ్యాన్ హోల్ ప్రమాదానికి నిలయంగా మారింది. మండల పరిధిలోని ఖమ్మంపాడు గ్రామం నుంచి రమణక్కపేట వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న మ్యాన్ హోల్‌పై కనీసం మూత ఏర్పాటు చేయలేదు. ఇది రహదారికి అనుకొని ఉండడంతో ప్రమాదకరంగా మారింది. రాత్రి సమయంలో మ్యాన్ హోల్ కనిపించపోవడంతో ద్విచక్రవాహనదారులు, పాదచారులు అదుపుతప్పి పడిపోతున్నారు. ఇప్పటికే ఇక్కడే అనేక ప్రమాదాలు జరిగాయని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. - అశ్వారావుపేటరూరల్

ప్రశ్నించాల్సిన అధికారి : ఎస్‌కే సలీమ్, డీఈఈ, మిషన్ భగీరథ, అశ్వారావుపేట
సెల్ నంబర్ :79956 60293